దర్శన్ సమాజానికి రోల్ మోడలా..?: మంత్రి రాజణ్ణ

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నటుడు దర్శన్ సమాజానికి రోల్ మోడలా..నిరంతరం ఆయన ప్రసారాలు అవసరమా అంటూ మంత్రి రాజణ్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హాసన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన రెండు రోజులుగా దర్శన్‌ను బళ్ళారి సెంట్రల్ జైలుకు తరలించడంపై వస్తున్న ప్రసారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే ముఖ్య ఘట్టమా అంటూ మండిపడ్డారు. హేమావతి ప్రాజెక్టుకు వాయనం సమర్పించేందుకు సీఎం సిద్దరామయ్యను కోరామన్నారు. వాతావరణం సరిగా లేనందున హెలికాప్టర్‌లో తిరిగేది లేదని చెప్పారన్నారు.



ఉపశమనం



● సీఎం, డీసీఎంకు ఊరట ● కోర్టులో సానుకూల తీర్పులతో అభిమానుల్లో ఆనందం

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు కాస్త ఉపశమనం లభించింది. ఒకేరోజు గంటల వ్యవధిలో కోర్టు వివాదాలపై సానుకూల తీర్పులు వెలువడడంతో కాంగ్రెస్ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇటు రాష్ట్రం, అటు అధిష్ఠానం, కాంగ్రెస్ వర్గాలు, నేతలు ఎదురుచూసిన క్షణం. తీర్పుల్లో ఏమాత్రం వ్యత్యాసమైనా రాష్ట్ర ప్రభుత్వ మనుగడ డోలాయమానంగా మారేది. అయితే ముడా ఇంటి స్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్యకు రెండు రోజుల తాత్కాలిక ఉపశమనం లభించింది. ఇక డీసీఎం డీకే శివకుమార్‌కు సంబంధించి అక్రమాస్తుల కేసును హైకోర్టులో విచారణ జరపలేమని సీబీఐ, బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. సుప్రీంకోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించింది. దీంతో ఇద్దరు అగ్రనేతలకు కేసులనుంచి పూర్తిగా ఉపశమనం లభించకపోయినా తాత్కాలికంగా ఊరట లభించింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం దాకా సాగుతున్న ఉత్కంఠతో రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏం జరగనుందోనని ఎదురు చూశారు. ఇద్దరి కేసుల్లోనూ ఊరట లభించడంతో పార్టీ కార్యకర్తలు సంబరపడ్డారు.





సీఎంకు ఇంకా ఇక్కట్లే

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో సీఎం సిద్దరామయ్య భార్య పేరిట 14 ఇంటి స్థలాలు కేటాయించడం వివాదమైంది. 2004లో మైసూరు పరిధిలోని కెసర గ్రామంలో సిద్దరామయ్య బావమరిది మల్లికార్జునయ్య 3.16 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 2005లో అగ్రికల్చర్ విభాగానికి మార్పు చేసుకున్నారు. 2010లో ఆ భూమిని పసుపు కుంకుమ కానుకగా మల్లికార్జునయ్య సోదరి పార్వతి (సిద్దరామయ్య భార్య)కు ఇచ్చారు. ఇదే భూమిని ముడా స్వాధీనం చేసుకుని పార్కు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించింది. కోల్పోయిన భూమికి 50:50 నిష్పత్తిన అభివృద్ధి చెందిన లేఅవుట్ విజయనగరలో 14 ఇంటి స్థలాలు పొందారు. ఆ భూమికి సంబంధించి రికార్డులు సరిలేవని పిత్రార్జితం ఆస్తి అంటూ చెప్పుకొనే భూమిలోనూ వారసులలో తప్పులు ఉన్నాయని, పైగా అభివృద్ధి చెందిన విజయనగర లే అవుట్‌లో 14 స్థలాలను రాజకీయ ఒత్తిడితో తీసుకున్నారని, సామాజిక కార్యకర్త టీజే అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై మైసూరుకు చెందిన స్నేహమయి కృష్ణ మైసూరులో ఫిర్యాదుతోపాటు బెంగళూరులో ప్రజాప్రతినిధుల కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో పాటు గవర్నర్‌కు విన్నవించారు. బెంగళూరులోని నాగరబావికి చెందిన అడ్వకేట్ ప్రదీప్‌కుమార్ గవర్నర్‌కు ఇదే వివాదంపై ఫిర్యాదు చేశారు. సామాజిక కార్యకర్త టీజే అబ్రహం ఫిర్యాదు మేరకు సీఎంకు గవర్నర్‌కు షోకాజ్ నోటీస్ ఇచ్చారు. గవర్నర్ సీఎం వివరణతో సంతృప్తి చెందకపోవడంతో ప్రాసిక్యూషన్‌కు ఆదేశించారు. రాజ్‌భవన్ నుంచి ముగ్గురికి సదరు కాపీలను అందించారు. సీఎంపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడంతో ఒక్కసారిగా అలజడి సాగింది. అయితే అధిష్ఠానం న్యాయపోరాటం చేయాలని, అండగా ఉంటామని భరోసా ఇవ్వడంతో హైకోర్టులో కేసు వేశారు. సీఎం తరపున అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. ఈనెల 19న సాగిన విచారణలు పదిరోజులకు వాయిదా పడ్డాయి.

న్యాయస్థానంలో విచారణ సాగిందిలా..

న్యాయస్థానంలో గురువారం ముడా కేసులో విచారణ హోరాహోరీగా సాగింది. సీఎం తరపున న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లోట్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై సమగ్ర విచారణలు అవసరమని ప్రాసిక్యూషన్‌కు అనుమతించారన్నారు. అయితే కేబినెట్ సలహాను పాటించకుండా సెక్షన్ 17ఏ, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 128 ప్రకారం అనుమతులు ఇవ్వడం రాజ్యాంగ, చట్టపరంగా వ్యతిరేకమన్నారు. 17ఏ కింద చర్యలకు ముందస్తు అనుమతులు కావాలని విచారణకు ఆదేశించేందుకు సాక్ష్యాలు సేకరించాలని, లేదా విచారణ నివేదిక ఉండాలని వీటిని పరిగణనలోకి తీసుకోకుండానే గవర్నర్ అనుమతులు ఇచ్చారన్నారు. టీజె అబ్రహం, గవర్నర్, కోర్టు ముందు ఇచ్చిన ఫిర్యాదులు గందరగోళంగా ఉన్నాయన్నారు. గవర్నర్ సమయాన్ని వృథా చేసిన అబ్రహంకు జరిమానా విధించాలన్నారు. గవర్నర్, ఫిర్యాదుదారుడు ప్రదీప్‌కుమార్‌లు అభ్యంతరాలను సమర్పించలేదన్నారు. గవర్నర్ సహజ న్యాయం పాటించాలన్నారు. బీజేపీ మాజీ మంత్రులు మురుగేశ్ నిరాణి, శశికళ జొల్లె, జనార్ధనరెడ్డిలపై ఎందుకు గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వలేదని పరోక్షంగా సీఎంను టార్గెట్ చేశారని వాదనలు వినిపించారు. గతంలోనూ పలువురు ముఖ్యమంత్రులు డీ నోటిఫికేషన్ చేశారన్నారు. గవర్నర్ కేవలం నాలుగు పేజీలతో అనుమతులు ఇచ్చారన్నారు.

ఇక డీసీఎం కేసులో రాష్ట్రం నుంచి భారీ ఉపశమనం లభించినట్లయింది. డీసీఎం డీకే శివకుమార్ అక్రమాస్తుల కేసులో తొలుత ఐటీ, ఆ తర్వాత ఈడీ విచారణ చేపట్టాయి. సదరు కేసును సమగ్ర దర్యాప్తుకు గత బీజేపీ పాలనలో సీబీఐకి అప్పగించారు. సుదీర్ఘ విచారణ జరిపారు. ఇదే కేసులో ఈడీ అరెస్టు చేయడంతో తీహార్ జైలులో గడిపి డీకే బెయిల్‌పై బయటకు వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో అప్పటి ప్రభుత్వం సీబీఐ ద్వారా విచారణకు ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంది. దీంతో సీబీఐ విచారణ కొనసాగించేందుకు వీలు లేనట్లయింది. ఈమేరకు సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే వివాదంపై బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే, కేంద్ర మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాళ్ కూడా పిటిషన్ వేశారు. రెండు పిటిషన్‌లను విచారణ పూర్తి చేసిన హైకోర్టు ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. గురువారం ప్రకటిస్తానని ముందుగానే వెల్లడించిన మేరకు ఎలాంటి నిర్ణయం వస్తుందోనని ఎదురు చూశారు. ఈ కేసును సుప్రీంకోర్టులో పరిష్కారం చేసుకోవాలని ధర్మాసనం సూచించింది. సీబీఐ, యత్నాళ్ దాఖలు చేసిన పిటీషన్‌లను కొట్టివేసింది. దీంతో డీకే శివకుమార్‌కు తాత్కాలిక ఉపశమనం లభించింది. అయితే హైకోర్టు సూచన మేరకు సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేస్తే న్యాయపోరాటం తప్పదు.

గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చు..

సిద్దరామయ్య ప్రాసిక్యూషన్ అనుమతులలో గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చునని కోర్టు పేర్కొంది. గవర్నర్ అనుమతులు ఇవ్వడం స్వతంత్ర నిర్ణయమని, మంత్రుల సలహాపై పునరాలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో రెండు రోజుల తర్వాత కోర్టు ఏ విధమైన ఆదేశాలు ఇస్తుందనేది మరోసారి ఆందోళనకు కారణమవుతోంది. అయితే తీర్పు అనుకూలమైతే ఉపశమనం ఉంటుందని గవర్నర్ ఆదేశాలకు అనుగుణంగా విచారణలకు సిద్ధమైతే తదుపరి ఏం చేయాలని రెండు రోజులుగా మంతనాలు జరిపారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కోర్టులో ఎటువంటి ఆదేశాలు వస్తాయోనని ఎదురుచూశారు. అయితే కేసు రెండురోజులకు వాయిదా వేయడంతో తాత్కాలికంగా ఊపిరి పీల్చుకున్నారు. అయితే శనివారం మరోసారి ఉత్కంఠ తలెత్తే అవకాశాలు లేకపోలేదు.







12 లక్షల రేషన్ కార్డులు రద్దు..!

- పన్ను చెల్లించే వారిపై అనర్హత వేటు
- ఆరాతీస్తున్న అధికారులు
- లబ్ధిదారుల్లో మొదలైన ఆందోళన

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కారణాలతో ఏకంగా 12 లక్షల బీపీఎల్ కార్డులు రద్దు చేయనున్నారు. ఈమేరకు జిల్లాలవారీగా ప్రక్షాళన కు అధికారులు సిద్ధమయ్యారు. ఏడాదికి 1.20 లక్షల రూపాయలకంటే ఎక్కువ ఆదాయం కల్గినవారి బీపీఎల్ కార్డులు 10.54 లక్షలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల వద్ద 4722 కార్డులు, వివిధ కేటగిరీలలో అనర్హులు, బీపీఎల్ కార్డులు పొందినట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో 10.84 లక్షల అంత్యోదయ కార్డులతో కలిపి 1.27 కోట్ల బీపీఎల్ కార్డులున్నాయి. వీటిలో 12 లక్షల కార్డులు తొలగించాలని పౌర ఆహార సరఫరాల శాఖ కసరత్తు జరుపుతోంది. ఒక్కో కార్డుకు మూడు నుంచి ఐదుగురు సభ్యులు ఉన్నారు. ప్రతి సభ్యుడికి 5 కేజీల చొప్పున బియ్యం చెల్లించాల్సి ఉండేది. అయితే బియ్యం కోటా లేకపోవడంతో బదులుగా నగదు రూపంలో రూ.170 ఇస్తున్నారు. ఇలా అనర్హులకు ఏడాదికి రూ.980 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని ఓ అధికారి తెలిపారు. ఆదాయపన్నులు కల్గినవారు, జీఎస్టీ చెల్లించేవారిని గుర్తించినట్లు తెలుస్తోంది. బీపీఎల్ కార్డు కల్గినవారికి గృహలక్ష్మి గ్యారెంటీ వర్తిస్తోందని నెలకు 2వేల రూపాయల చొప్పున పొందుతున్నారన్నారు. ఇలా నెలకు రూ.250 - 300 కోట్ల దాకా చెల్లింపులు సాగుతున్నాయన్నారు. అనర్హులకు బీపీఎల్ కార్డులు రద్దు చేస్తే కనీసం 1200 కోట్ల రూపాయలు ఆదా కానుందని అంచనాగా ఉందన్నారు. బీపీఎల్ కార్డులు తొలగించాలనే ప్రక్రియ కొత్తదేమీ కాకున్నా కాలానుగుణంగా వాయిదా వేస్తూ వచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అనర్హత కార్డులను తొలగించాలని భావించారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలంటే చెడ్డపేరు వస్తుందని వాయిదా వేశారు. ఈలోగా లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తుండడంతో ఆచితూచి వ్యవహరించారు. ఇప్పుడు ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో కార్డులు తొలగించేందుకు యంత్రాంగం సిద్ధమయ్యింది.



రాష్ట్ర వాటా పెంచండి



● 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సీఎం సిద్దరామయ్య వినతి



చైర్మన్‌తో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 16వ ఫైనాన్స్ కమిషన్‌లో రాష్ట్ర వాటా పెంచాలని సీఎం సిద్దరామయ్య కోరారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు గురువారం విచ్చేసిన 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద పనగారియాను ఆయన కోరారు. అజయ్ నారాయణ ఝు, అన్నిజార్జ్ మాథ్యూ, డాక్టర్ మనోజ్‌పాండ్య, సౌమ్యాకాంత్ జోష్ సభ్యులతో సీఎం చర్చలు జరిపారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చిన 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులను స్వాగతించానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపినట్లుగా సహకార సమాఖ్యను ఉత్తేజ పరిచేందుకు ఆర్థిక వనరులే మూలమని తెలిపామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పన్నులవాటా సిఫారసుల విషయంలో ఫైనాన్స్ కమిషన్‌కు ఆర్టికల్ 280 లో నిబంధనలు ఉన్నాయన్నారు. కమిషన్‌లో నిపుణులు స్వతంత్ర, నిష్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుందన్నారు. కమిషన్ న్యాయ సమ్మతంగా వ్యవహరిస్తుందన్నారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో కర్ణాటక కీలకంగా ఉందన్నారు. జనాభాలో 5శాతం ఉన్నా జాతీయస్థాయిలో కర్ణాటక జీడీపీ 8.4శాతంగా ఉందన్నారు. ఏటా రాష్ట్రం నుంచి 4 లక్షల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్నా రాష్ట్రానికి వాటాలో భాగంగా కేవలం 45వేల కోట్లు మాత్రమే వస్తోందన్నారు. రాష్ట్రం నుంచి వెళ్లే పన్నుల్లో రూపాయికి 15పైసలు చొప్పున వాపసు వస్తోందన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో కర్ణాటకకు 4.713 శాతం నుంచి 3.647 శాతానికి తగ్గించారని తద్వారా 2021-26ల మధ్యన ఐదేళ్లలో రాష్ట్రానికి 68,275 కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో జరిగిన పొరపాట్లను 16వ ఫైనాన్స్ కమిషన్‌లో సర్దుబాటు చేయాలని కోరానన్నారు. సెస్, సబ్‌చార్జ్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంచుకునేందుకు రాదన్నారు. రెండింటిపైనా ఏటా పెంచుతూ వచ్చారన్నారు. 2017-18 నుంచి 2025-25 వ్యవధిలోనే 53,359 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. రానున్న ఐదేళ్లలో బెంగళూరు అభివృద్ధికి 55,586 కోట్ల రూపాయలు పెట్టుబడులు అవసరమని మేం కేంద్రం నుంచి 27,793 కోట్ల రూపాయల గ్రాంటు కోరుతున్నామన్నారు. వెనుకడిన కల్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి 25 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టదలిచామన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో తగ్గించిన వాటా శాతాన్ని ప్రస్తుతం పెంచాలని కోరామన్నారు.

నగరంలో జోరువాన

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా పలు చోట్ల జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పాఠశాల, కళాశాలల నుంచి విద్యార్థులు ఇంటికి చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పలు కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. ఎంజీ రోడ్డు, చిన్నస్వామి స్టేడియం, శివాజీనగర్, కంటోన్మెంట్, ఆర్‌టినగర్, హెబ్బాళ, మెజస్టిక్, జయనగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారుల్లో ప్రయాణానికి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.




వర్షంలోనూ పోలీసుల విధులు..


వాహనదారులు, నగరవాసులకు తప్పని ఇక్కట్లు

అమలు అసాధ్యం

● కస్తూరిరంగన్ సిఫారసులపై అటవీశాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రె

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమకనుమల సంరక్షణకు సంబంధించి ప్రముఖ శాస్త్రవేత్త కస్తూరిరంగన్ నివేదికను సంపూర్ణంగా అమలు చేయడం అసాధ్యమని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె అభిప్రాయపడ్డారు. కేంద్రప్రభుత్వం జారీ చేసిన కస్తూరిరంగన్ కమిటీ సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సాధ్యం కాదని, ఇదే విషయాన్ని మంత్రివర్గ కమిటీలోనూ చర్చ జరిగిందన్నారు. నగరంలో గురువారం మంత్రి ఈశ్వర్‌ఖండ్రె మాట్లాడుతూ రాష్ట్రంలో 20,668 చదరపు కిలోమీటర్ల ప్రదేశాన్ని పర్యావరణ సూక్ష్మవలయంగా గెజిట్ జారీ అయ్యిందన్నారు. అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, పర్యావరణ సూక్ష్మ ప్రదేశాలుగా 16,632 చదరపు కిలోమీటర్ల ప్రదేశాన్ని అభయారణ్యంగా ప్రకటించారు. మిగిలిన ప్రదేశంలో 1533 ఇళ్లు, గ్రామాలు, ఇతర వసతి స్థలాలు ఉన్నాయన్నారు. ప్రజల హక్కులు, జీవనోపాధిని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రివర్గ సబ్ కమిటీలోని తీర్మానాలను ముఖ్యమంత్రికి వివరించి కేబినెట్‌లో అంతిమ నిర్ణయం తీసుకుంటామన్నారు. కేబినెట్ తీర్మానాన్ని కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. రాష్ట్రాలకు తమ ప్రతిపాదనలు సమర్పించేందుకు సెప్టెంబరు చివరిదాకా సమయం ఉందన్నారు. కర్ణాటకలోని పశ్చిమ కనుమల పరిధిలో పది జిల్లాల ప్రజల అభిప్రాయాలను సేకరించామని వాటిని ముఖ్యమంత్రికి సమర్పిస్తామన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.01	1,625.61
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	29,014	106
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,843	6,611
సామర్థ్యం (టీఎంసీలు)	90.38	78.50

యువజనుల కోసమే క్రీడాదినోత్సవాలు



ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 29: దేశంలోని యువత క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు అన్నారు. శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థుల కోసం నిర్వహించిన ఖో-ఖో టోర్నమెంట్‌ను ఆయన మొక్కలు నాటి ప్రారంభించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడలు మనల్ని శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. సంకోచం వదిలి క్రీడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పోటీతత్వం కనబరచాలన్నారు. అతిథులుగా పాల్గొన్న యూనివర్శిటీ నేషనల్ సర్వీసెస్ స్కీమ్ కోఆర్డినేటర్లు మాట్లాడుతూ, సాంఘిక విజ్ఞాన సంస్థలోని విభాగాలకు సొంత భవనం లేదని, దీనిని ఏర్పాటు చేస్తే సంస్థలోని విద్యార్థులు క్రీడలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్మారకార్థం నిర్వహించిన ఖో-ఖో టోర్నమెంట్‌లో గెలుపొందిన డిపార్ట్‌మెంట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు చాన్సలర్ ట్రోఫీని అందజేశారు. ఈసందర్భంగా డా.సంపత్‌కుమార్, శశిధర, గెస్ట్ లెక్చరర్లు మహేశ్, రాజేశ్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అఘాయిత్యాలను అరికట్టాలి



వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐఎంఎస్ఎస్

బళ్లారి సిటీ, ఆగస్టు 29: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న సామాజిక అఘాయిత్యాలను అరికట్టాలని ఏఐఎంఎస్ఎస్ జిల్లాధ్యక్షురాలు ఈశ్వరి అన్నారు. భారత దేశపు పునరుజ్జీవనోద్యమానికి కారణమైన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 133వ సంస్మరణ దినోత్సవం సందర్భంగా మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని కోరుతూ జిల్లాకలెక్టర్ సిబ్బంది ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఏఐఎంఎస్ఎస్ జిల్లా కార్యాలయంలో జూలై 29నుంచి ఆగస్టు 29 వరకు జరిగిన మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె మాట్లాడారు. ఈ కాలంలో చదువుకున్న ప్రతి బాలిక ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ను స్మరించుకోవాలన్నారు. ఆయన ఆనాటి కఠినమైన సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా గళంవిప్పారన్నారు. ఈసందర్భంగా ఏఐఎంఎస్ఎస్ ఉపాధ్యక్షులు పద్మావతి, రేఖా,విద్యా, అభిలాష్, సౌమ్యగిరిజా, కరిబసమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌తో మోసపోవద్దు

బళ్లారి రూరల్, ఆగస్టు 29: బళ్లారి జిల్లా ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలు సైబర్ నేరాలపై జాగ్రత్తగా వుండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సంతోష్ చౌహాన్ తెలిపారు. గత కొద్ది రోజులుగా సైబర్ నేరాలకు సంబంధించి ఎక్కువ కేసులు నమోదు కావడంతో షేర్ మార్కెట్‌లో అవకతవకలుచోటుచేసుకుంటున్నాయన్నారు. తమ పేరు వాడుకొని టెలిగ్రామ్ ద్వారా అమాయక ప్రజలను వారి అకౌంట్ నుండి డబ్బులు డ్రా చేస్తున్న వారి అకౌంట్లో నుండి డబ్బులు డ్రా చేస్తున్న విషయాలపై సైబర్ క్రైమ్‌లో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గ్రామీణ ప్రజలతో పాటు నగరవాసులు అప్రమత్తంగా వుంటూ షేర్ మార్కెట్ ఆన్‌లైన్ గేమ్స్, మీ అకౌంట్‌కు సంబంధించిన ఆధార్ కార్డు నెంబర్లు కూడా ఎవరి ఇవ్వకుండా మోసపోకూడదని సైబర్ క్రైమ్ డీఎస్పీ సంతోష్ చౌహాన్ తెలిపారు.

రెండో అధికార భాషగా తెలుగు

తెలుగు భాషాదినోత్సవంలో వక్తల డిమాండ్



రాఘవ కళామందిరంలో జ్యోతిని వెలిగించి తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్న ప్రముఖులు

బళ్లారి సిటీ, ఆగస్టు 29: కర్ణాటకలో అత్యధికంగా తెలుగు ప్రజలు ఉన్నారని, కనుక రాష్ట్రంలో తెలుగును రెండో అధికార భాషగా ప్రభుత్వం గుర్తించాలని రాఘవ కళామందిరం అధ్యక్షులు. న్యాయవాది కోటేశ్వరరావు కోరారు. గురువారం రాఘవ కళా మందిరంలో రాఘవ మెమోరియల్ అసోషియేషన్, తెలుగు సంస్కృతిసమితి, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సంఘాల ఆధ్వరంలో గురువారం తెలుగు మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ, విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అలాగే హంపీ విశ్వవిద్యాలయంలో తెలుగు పీఠం స్థాపించాలని కోరారు. తెలుగు సంస్కృతి సమితి అధ్యక్షుడు గాదెం గోపాలకృష్ణ, కార్యదర్శి గాజుల ప్రభాకర్, అమర్‌నాథ్ చౌదరి, జీ.ఆర్, వెంకటేశులు, ఎం. రామాంజినేయులు, కాళిదాస్, రఘురాం, డాక్టర్ సురేంద్ర బాబు, రామచంద్ర, తదితరులు మాట్లాడారు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, బళ్లారి రాఘవ తదితర మహాను భావులు తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారన్నారు. గిడుగు రామమూర్తి పంతులు, తెలుగు వ్యవహారిక భాషోద్యమనాయకుని, జయంతి సందర్భంగా తెలుగు మాతృ భాష దినోత్సం ఆచరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పౌర కార్మికులకు పాదపూజ

కుడితిని పంచాయతీలో అధ్యక్ష, ఉపాధ్యక్షుల వినూత్న చర్య

కంప్లి, ఆగస్టు 29 : పట్టణాన్ని పరిశుభ్రం చేసే పౌరకార్మికులు బాగుంటేనే పట్టణం బాగుంటుందని కుడితిని పట్టణ పంచాయతీ నూతన అధ్యక్షురాలు బసమ్మ చంద్రప్ప, ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి అన్నారు. గురువారం వారు అధికార బాధ్యతలు తీసుకున్నారు. పలువురు సంఘ సంస్థల నేతలు వారిని పూలమాలలతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు 42 మంది పౌర కార్మికులకు పాదపూజ చేపట్టి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, పట్టణంలో వుండే 19వ వార్డు ప్రజలు వీరిని గౌరవించాలన్నారు. పట్టణంలో చెత్త సేకరణ కార్యక్రమాలకు వారు మన ఇంటికి వచ్చే సమయంలో తడి, పొడి చెత్తను వేరుచేసి వుంచాలన్నారు. అలాగే వర్షాకాలంలో తమ ఇళ్ల ముందు నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలన్నారు. అలాగే పారిశుధ్యం కూడా కాపాడు కోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా పౌర కార్మికులకు వచ్చే సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వారితో పాటు రాజశేఖర్, వెంకటరమణ బాబు, దుగ్గప్ప, హాలప్ప, సునిల్, మంజునాథ, రామలింగప్ప, లెనిన్, దేవమ్మ, గీత, నాగరాజు, సుజాత, రత్నమ్మ, భాగ్యశ్రీ, శంకరమ్మ, సొలమ్మ, ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్‌లు పాల్గొన్నారు.



పౌర కార్మికులను సన్మానిస్తున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు

అట్టహాసంగా హాకీ టోర్నమెంట్

- ప్రారంభించిన ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

రాయచూరు, ఆగస్టు 29: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాయచూరు నగరంలోని మహాత్మగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న రెండు రోజుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర జల్దార్ మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపు ఓటములను సమాన స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు ధ్యానచంద్ 119వ జయంతి, జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించిన రెండు రోజుల టోర్నమెంట్‌లో తొలి రోజు గురువారం శివమొగ్గ, మైసూరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఒక గోల్‌తో శివమొగ్గ వెనకంజ వేయగా ఐదు గోల్ స్పూర్తి చేసిన మైసూరు జట్టు విజయం సాధించింది. అనంతరం హైదరాబాద్, బళ్లారి జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా పోటీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 24 జట్లు పాల్గొంటుండగా వీటిలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



గెలుపొందిన మైసూరు జట్టు



ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

నగరంలోని రేస్ చాణుక్య పాఠశాలలో గురువారం జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ క్రీడాకారుడు ధ్యానచంద్ చిత్రపటానికి జిల్లా వ్యాయామ విద్యాశాఖ అధికారి రంగస్వామి, పరశురామ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవధ్యక్షుడు రాజేశ్ కుమార్‌లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజేశ్ కుమార్, క్రీడల్లో అంతర్జాతీయ కీర్తి గడించిన ధ్యానచంద్‌ను నేటితరం క్రీడాకారులు స్పూర్తిగా తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థులు క్రీడలకు తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ధృడత్వం, మానసిక వికాసంతో పాటు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు.

సిద్దరామయ్యకు మద్దతుగా డీఎస్ఎస్ ర్యాలీ

బళ్లారి సిటీ, ఆగస్టు 29: కర్ణాటక రాష్ట్ర దళిత సంఘర్షణ సమితి(డీఎస్ఎస్) సాగర్ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ మానయ్య ఆధ్వర్యంలో గురువారం నగరంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు మద్దతుగా ప్రదర్శన జరిగింది. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన గడిగి చెన్నప్ప సర్కిల్ మీదుగా డీసీ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ నిర్వాహకులు జిల్లా యంత్రాంగానికి వినతి పత్రం సమర్పించారు.

ఈసందర్భంగా ఆందోళనకారులను ఉద్దేశించి మానయ్య మాట్లాడుతూ ముడా కుంభకోణానికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇప్పటికే సమాధానమిచ్చారన్నారు. ఈకేసులో సిద్దరామయ్య పాత్ర లేదని, ప్రజల చేత ఎన్నుకోబడని గవర్నర్ సరైన విచారణ చేయకుండానే ముఖ్యమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం సరికాదన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పక్షాల నుంచి ప్రజలు ఎన్నుకున్న బీజేపీయేతర ప్రభుత్వాలను కూల్చివేసి, దొడ్డిదారిన అధికారాన్ని చేజిక్కించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం తగదన్నారు. ర్యాలీలో వివిధ సంఘాలకు చెందిన గాదిలింగనగౌడ్, హుమాయున్ ఖాన్, ఎరుకల స్వామి, నరసప్ప, విజయకుమార్, శివశంకర్ శ్రీనివాస్‌మూర్తి, దురగప్ప, గంగప్ప, దేవదాస్, అంజినయ్యచ మల్లయ్యమల్లికార్జున, మహేశ్, నాగేంద్రప్ప, బిసలహళ్ళి రమేశ్,మల్లప్ప, శంకర్, రామయ్య, జగదీశ్ మేత్రి, కుమార్ మేత్రి, మారెప్ప, హలకుంది ఎర్రిస్వామి, పరశురాం, గంగాధర, విజయ్, హొన్నూర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్ఎస్

బెస్ట్ కళాశాలలో సీఏ కోర్సుపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో సీఏ కోర్సు బ్రాంచ్ చైర్మన్ వెంకటనారాయణ

బళ్లారి సిటీ, ఆగస్టు 29: చార్టర్డ్ అకౌంటెంట్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో బళ్లారి జిల్లాలోని ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రీ-గ్రాడ్యుయేషన్ కళాశాలలో సీఏ కోర్సుపై గురువారం సంప్రదింపుల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీఏ బ్రాంచ్ చైర్మన్ వెంకటనారాయణ, వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ అభివృద్ధితో పాటు సమాజానికి విలువైన ఆలోచనలను అందించాలన్నారు. విద్యార్థులతో ఇంటరాక్షన్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఘనంగా జరపాలి



పీయూసీ కళాశాలలో సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిరుగుప్ప, ఆగస్టు 29 : సెప్టెంబరు 5వ తేదీ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను జరపాలని ఉపాధ్యాయుల సంఘం నిర్ణయం తీసుకుంది. గురువారం సిరుగుప్ప పట్టణం పీయుసీ కళాశాలలో విద్యాశాఖాధికారి గురప్ప అధ్యక్షతన వేడుకలు ఆచరించడంపై ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ముందస్తు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గురప్ప మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ తత్వసిద్ధాంతాలు నేటికీ మరువరానివని తెలిపారు. ఆయన గుర్తుగా ఉపాధ్యాయుల దినోత్సవం ఆచరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర, లింగరాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, ఆగస్టు 29 : రోజుకు 60 వేల మందికి సభ్యత్వం నమోదు చేయాలని ఎమ్మెల్యే సోమలింగప్ప కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం సిరుగుప్ప పట్టణం భవాని కళ్యాణ మండపంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో బీజేపీ సభ్యత్వ నమోదులో భారీ ముందడుగులో వుందన్నారు. కార్యకర్తలు ఇల్లిల్లు తిరిగి సభ్యత్వం నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ యువనాయకులు ధరప్ప నాయక, మల్లయ్య, ప్రధాన కార్యదర్శి బంద్రాళ్ మల్లికార్జున, బసవరాజ, ఎస్సీ మోర్చ అధ్యక్షులు మైకేల్ వీరేష, మహదేవ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపూజీ వ్యాసరచన పోటీని పకడ్బందీగా నిర్వహించాలి

బళ్లారి సిటీ, ఆగస్టు 29: మహాత్మాగాంధీ 155వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉన్నత పాఠశాలలు, గ్రాడ్యుయేట్ విద్యార్థులకు బాపూజీ వ్యాసరచన పోటీలు చక్కగా నిర్వహించాలని జిల్లాపంచాయతీ ఉప కార్యదర్శి గిరిజాశంకర్ ఆదేశించారు. జిల్లాస్థాయి బాపూజీ వ్యాసరచన పోటీల నిర్వహణకు సంబంధించి జిల్లాపంచాయితీ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన ముంద స్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లాలోని ప్రతి తాలూకా నుండి ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని పోటీలను విజయవంతం చేయాలని అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం

కంప్లి, ఆగస్టు 29 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. గురువారం కంప్లి కోట్టాల, ఎండీ క్యాంపు, సీపిరిదిన్నె, చిక్కజాగనూరు రోడ్డు సోమప్ప కాలనీలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటికే పూర్తిగా నెరవేర్చుతూ అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రెండు తాలుకాల్లో రెండు నివాసాలు ఏర్పాటు చేసుకుని 15 రోజులకొక తాలుకాలో వుంటూ అక్కడి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గంగన్న, గిరి, ఉలిగప్ప, రాజేష్, హబీబ్ రెహ్మాన్, జాఫర్, గోపాలప్ప, ఎండీ క్యాంపులోని కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేపట్టిన ఎమ్మెల్యే గణేష్

హోసూరు జోన్

విమానాశ్రయ ఏర్పాటుపై ధన్యవాదాలు తెలిపిన డీఎంకే



సమావేశానికి హాజరైన డీఎంకే నాయకులు, కార్యకర్తలు

హోసూరు, ఆగస్టు 29: హోసూరులో సుమారు 2000 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే తరఫున తీర్మానం ఆమోదించారు. తళి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళ్యాణమంటపంల్లో గురువారం డీఎంకే సభ్యుల సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా చైర్మెన్ యువరాజ్ అధ్యక్షత వహించారు. మేయర్ సత్య అందరికి స్వాగతం పలికారు. ఈ సమావేశంల్లో యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, గజేంద్రమూర్తి బాగ్యరాజ్, సిన్‌రాజ్, కరుణాకరన్, శ్రీధర్ , రాజా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, దస్తగీర్, మున్సిపల్ నిర్వాహకులు పాల్గొన్నారు. సెందిల్‌కుమార్, గోపాలకృష్ణన్, రవికుమార్, శాంతి, త్యాగరాజ్, నాయకత్వం వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహార సరఫరా శాఖ మంత్రి ఎ.చక్రపాణి, జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, హాజరై ప్రత్యేక ప్రసంగం చేశారు. డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధి స్మారకంగా రూ.100 రూపాయల నాణెం విడుదలపై ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. అలాగే కొత్త సభ్యుల కార్డుల జారీ , ఓటరు జాబీతా ధృవీకరణ , ఓఎంఆర్ ఫాంను త్వరగా జారీ చేయడం, డీఎంకే సాధించిన విజయాలకు సంబంధించి సంతాప తీర్మానాలను కూడా ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా ఉప కార్యదర్శులు మురుగన్ మాజీ ఎమ్మెల్యే చిన్నస్వామి, పుష్ప సర్వేశ్ కోశాధికారి సుకుమారన్, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడు వీరారెడ్డి, ఎల్లోరమణి, రాష్ట్రం యూత్ సహాయ కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్రం మైనారిటీల సంక్షేమం హక్కు. డివిజనల్ డిప్యూటీ సెక్రటరీ విజయకుమార్, రాష్ట్ర వ్యవసాయం టీమ్ డిప్యూటీ సెక్రటరీ అకియప్పన్ పాల్గొన్నారు.

కృష్ణగిరి జిల్లాకు పశువైద్య అంబులెన్స్‌ల అందజేత

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 29: మన దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన పశువుల పెంపకం రేటును పెంచేందుకు నాణ్యమైన పశువైద్య సేవలను ప్రతిచోటా అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన మొబైల్ వెటర్నరీ వెహికల్ ప్రాజెక్టుకు ఉద్దేశించిన 200 సంచార పశువైద్య వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి వాహనంలో వైద్య బృందాలు ఉంటాయి. ప్రతి వారం సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పశు చికిత్సా శిబిరాలను నిర్వహి స్తారు. పశువులకు చికిత్స చేయడానికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసర వాహనాలను ఏర్పాటుచేశారు. ఆదివారాల్లో అంబులెన్స్ ద్వారా వెళ్లి కూడా చికిత్స అందించవచ్చు. అంబులెన్స్‌ల్లో పశువైద్యుడు, సహాయకుడు, డ్రైవర్‌లు విధుల్లో ఉంటారు. ఈ వెటర్నరీ అంబులెన్స్‌కు అత్యవసర కాల్ నంబర్ 1962 కాల్ చేయాలని ప్రకటించారు. కృష్ణగిరి జిల్లాకు ప్రస్తుతం 7 సంచార పశువైద్య వాహనాలు అందించారు.. వాటి ద్వారా గ్రామాల్లో పశువులకు వైద్య పరీక్ష, మైనర్ సర్జరీ, నులిపురుగులు నిర్మూలన, టీకా పనితోపాటు వివిధ వైద్య సేవలు ఉచితంగా అందజేస్తున్నారు. కృత్రిమ గర్భదారణకు మాత్రమే రూ.10 రుసుము చెల్లించాలి, అందువల్ల పశువుల పెంపకందారులు ఉపయోగించే సంచార పశువైద్య వాహనాలు ఆహారం, రేషన్‌లను అందిస్తాయని, ఆహార శాఖ మంత్రి ఆర్. చక్రపాణి అన్నారు. ఈ కార్యక్రమంలో హోసూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, పశువైద్యులు ఇళంగోవన్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ , అసిస్టెంట్ డైరెక్టర్లు, మరియసుందర్, జ్యోతిబసు, రవిచంద్రన్, మహేంద్రన్ అసిస్టెంట్ డాక్టర్లు, ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్లు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



అంబులెన్స్ తాళాలు అందజేస్తున్న మంత్రి ఆర్.చక్రపాణి

చెట్టుకొమ్మ విరిగిపడి కార్లు ధ్వంసం



రాయచూరు, ఆగస్టు 29: నగరంలోని డీడీపీఐ కార్యాలయం ఆవరణలోని పురాతన చెట్టు కొమ్మ విరిగిపడడంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. డీడీపీఐ కార్యాలయం పూర్తి శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఆ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించగా ఆవరణ విశాలంగా ఉండడంతో తహసీల్దార్ కార్యాలయం, హెడ్‌పోస్టాఫీస్, నగరసభ ఇతర కార్యాలయాలకు వచ్చే ప్రజలు తమ వాహనాలను ఈ కార్యాలయం ఆవరణలో నిలుపుకుంటున్నారు ఈ క్రమంలో గురువారం చెట్టునీడన ఆపి ఉన్న ఇన్నోవా, ఇండికా, క్రేటా మొత్తం మూడు కార్లు ధ్వంసమైయ్యాయి. చెట్టు విరిగిపడిన సమయంలో అక్కడెవ్వరు మనుషులులేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న సదర్ బజార్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నేడు నగరానికి హేలన్ మేరి

రాయచూరు, ఆగస్టు 29: అంతర్జాతీయ హాకీ క్రీడాకారాణి హేలన్ మేరి శుక్రవారం నగరానికి రానున్నారు. హాకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి హాకీ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆమె ఇక్కడికి రానున్నారు. ఇటలి, స్పేన్, న్యూజిలాండ్ తదితర అంతర్జాతీయ పోటీల్లో భాగస్వామిగా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని అర్జున్ అవార్డును దక్కించుకున్న హేలన్ మేరి అనేక ట్రోఫీలను స్వంతం చేసుకున్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారిణి నగరానికి రానున్న సందర్భంలో క్రీడాకారులు ఆమె రాక కోసం ఆతృతతో ఎదురు చేస్తున్నారు.

పాఠశాల అభివృద్ధి కమిటీ నియామకం

కంప్లి, ఆగస్టు 29 : తాలుకా పరిధిలోని రామసాగరం ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ పదాధికారుల నియామకం జరిగింది. అధ్యక్షులుగా ఎం ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా రాధ, పది మంది సభ్యులుగా నియామకమయ్యారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు పలువురు సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎం ప్రశాంత్ మాట్లాడుతూ తమపై నమ్మకం వుంచి తమను పాఠశాల కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారని, అందరి సహకారంలో పాఠశాల అభివృద్ధి చేపట్టి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగనగౌడ, నారాయణప్ప, రామయ్య, రామదేవప్ప, గురురాజు, వీరేష్, మంజునాథ్, హెచ్‌ఎం నీలావతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

జమున (జయంతి)



దక్షిణాది అలనాటి నటి జమున 1936 ఆగస్టు 30న కర్ణాటక రాష్ట్రం హంపిలో జన్మించారు. పెరిగింది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దుగ్గిరాలలో. పాఠశాలలోనే నాటకాలపై మక్కువ కలిగిన ఆమె 1952లో సినీరంగానికి ప్రవేశించారు. శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలలో శిక్షణ పొందారు. తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో మూడు దశాబ్దాలలో సుమారు 200 సినిమాలలో నటించారు. పౌరాణిక, జానపద, సాంఘిక ఇలా అన్ని రకాల సినిమాలు ఉన్నాయి. 60, 70 దశకాలలో హీరోయిన్‌గా రాణించారు. రాము, ఏకవీర, మూగనోము, ఆడజన్మ, శ్రీకృష్ణ తులాభారం వంటి సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. రెండు ఫిల్మ్‌ఫేర్, ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, తమిళనాడు రాష్ట్ర గౌరవ ఎంజీఆర్ అవార్డు, 2019లో సంతోషం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వంటి పురస్కారాలు పొందారు. 1990లో రాజమండ్రి నుంచి లోక్‌సభకు పోటీచేసి గెలుపొందారు. తెలుగు ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసి పాతికేళ్లపాటు సమాజసేవ కొనసాగించారు. 2023 జనవరి 27న కన్నుమూశారు.

వారెన్ బఫెట్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు వారెన్ ఎడ్వర్డ్ బఫెట్ 1930 ఆగస్టు 30న జన్మించారు. బెర్క్‌షైర్ హాత్‌వే సంస్థకు చైర్మన్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచంలో తొలి పది కుబేరులలో ప్రస్తుతం ఏడో స్థానంలో ఉండగా సమాజసేవల ద్వారా మానవతావాదిగాను గుర్తింపు పొందారు. 1951 నుంచి ఇప్పటివరకు వాణిజ్యరంగంలో తనదైన సత్తా చాటుకున్నారు. ఆయన సంగీత కారుడు, స్టోరీ టెల్లర్ కూడా. ఫుట్‌బాల్, బ్రిడ్జ్ గేమ్స్‌పై ఆసక్తిగల ఆయన బిల్‌గేట్స్‌తో కలసి 'ది గివింగ్ ప్లెడ్జ్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు.

రవిశంకర్ ప్రసాద్ (పుట్టినరోజు)



రవిశంకర్ ప్రసాద్ 1954 ఆగస్టు 30న బీహార్ రాష్ట్రం పాట్నాలో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది. బీజేపీలో చేరి పలు రాజకీయ హోదాలలో కొనసాగారు. డిజిటల్ టెక్నాలజీ, ఇ-గవర్నమెంట్ విభా గంలో కీలకనేతగా పేరొందారు. పాట్నా నుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేంద్రంలో వివిధశాఖల మంత్రిగా వ్యవహరించి గ్రామీణ ప్రాంతాలకు సైతం ఇ-పాలన, డిజిటల్ ఇండియా పథకాలు అందేలా ఎంతో కృషి చేశారు.

రేపు విద్యుత్ కోత

శిడ్లఘట్ట, ఆగస్టు 29: శిడ్లఘట్ట 66/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో పనుల నిర్వహణ కారణంగా ఈనెల 31న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. టిబి రోడ్డు, దేశదపేటె, మయూర సర్కిల్, భూతాళ, సీఆర్ లే అవుట్, కెకె పేటె, అశోక్ రోడ్డు కనకనగర్, గాంధీనగర్, కేఈబీ రోడ్డు, కేఎస్ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల పరిధిలో ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5వరకు విద్యుత్‌కోత ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

హిందూపురం, ఆగస్టు 29: జిల్లాలో గురువారం రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. ఒదూపురం-బెంగళూరు ప్రధాన రహదారిపై మండంలోని చౌళూరు గేటువద్ద బుధవారం రాత్రి కారు బోల్తాపడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మృతిచెందారు. తూముకుంట పారిశ్రామికవాడలోని స్టీల్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉమేష్‌కుమార్ (38) సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండేవారు. గురువారం రాత్రి గౌరీబిదనూరు నుంచి తూముకుంట పారిశ్రామికవాడకు కారులో వస్తుండగా చౌళూరుగేటు వద్ద బోల్తాపడింది. ఉమేష్‌కుమార్, డ్రైవర్ సూరజ్ (36) మృతిచెందాడు. వీరి దేహాలను గౌరీబిదనూరు ఆస్పత్రికి తరలించారు. గౌరీబిదనూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని కార్మికుడు..

పెనుకొండ రూరల్: మండలంలోని హరిపురం వైజంక్షన్ వద్ద 44వ జాతీయరహదారిపై గురువారం బైక్‌ను లారీ ఢీకొట్టడంతో కార్మికుడు లవకుమార్(19) మృతిచెందాడు. రొద్దం మండలం పెద్దమంతూరు గ్రామానికి చెందిన లవకుమార్ కియ అనుబంధ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. విధుల్లో భాగంగా బైక్‌లో పెనుకొండ నుంచి కియ వైపు వెళ్తుండగా.. హరిపురం వైజంక్షన్ వద్ద బెంగళూరు నుంచి టెంకాయల లోడుతో వెళ్తున్న లారీ వెనుకనుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన లవకుమార్‌ను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మృతిచెందాడు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు కియ ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

రేపే పింఛన్

పుట్టపర్తి, ఆగస్టు 29: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్టీయార్ భరోసా పింఛన్‌ను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ అందజేసేవారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 31నే పింఛన్ సొమ్ము ఇవ్వనున్నారు. అందులో భాగంగా శుక్రవారమే బ్యాంకుల నుంచి డబ్బు డ్రాచేసి, ఆయా మండలాల అధికారులు, కమీషనర్లకు చేర్చాలంటూ జిల్లా కలెక్టర్ చేతన్ ఆదేశించారు. జిల్లాలో 2,68,079 మంది లబ్ధిదారులు ఉండగా.. రూ.115 కోట్లు విడుదలైంది. 31న పింఛన్ తీసుకోలేని వారికి సెప్టెంబరు 2న ఇవ్వనున్నారు.

బెస్ట్ టీచర్ అవార్డులకు 42 దరఖాస్తులు

అనంతపురం విద్య, ఆగస్టు 29: అనంతపురం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 42 దరఖాస్తులు వచ్చాయి. అనంతపురం డివిజన్‌లో ఎస్జీటీ కేటగిరీ నుంచి 7, స్కూల్ అసిస్టెంట్ల నుంచి 7 దరఖాస్తులు వచ్చాయి. కళ్యాణదుర్గం డివిజన్ నుంచి ఎస్‌జీటీ కేటగిరీ నుంచి రెండు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ నుంచి 15 దరఖాస్తులు, ప్రధానోపాధ్యాయుల కేటగిరీ నుంచి ఒకటి వచ్చాయి. గుంతకల్లు డివిజన్ నుంచి ఎస్‌జీటీ కింద 6, స్కూల్ అసిస్టెంట్ 3, ప్రధానోపాధ్యాయులు 1 వచ్చాయి.

ఉత్సాహంగా మేరీమాత ఉత్సవాలు



మేరీ మాత రథం

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శివాజి నగర్‌లోని సెయింట్ బెసిలికా చర్చ్‌లో మేరీ మాత ఆరోగ్య ఉత్సవాలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆర్చ్ బిషప్ డాక్టర్ పీటర్ మచాడో మేరీమాత రథాన్ని లాగడం ద్వారా శ్రీకారం చుట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. వర్షం జల్లులు కురుస్తున్నా గొడుగులు పట్టుకుని రథం వెంట ప్రార్థనలు చేసుకుంటూ కదిలారు. సెప్టెంబరు 8వరకు ఉత్సవాలు సాగుతాయని నిర్వాహకులు తెలిపారు. శివాజినగర్ ప్రాంతానికి పండుగ వాతావరణం వచ్చింది. వందలాది దుకాణాలు వెలిశాయి. శివాజినగర్ బస్టాండ్‌కు వెళ్లే బస్సులను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సర్కిల్ వద్దే నిలిపివేశారు. నగరంలోని వందలాది చర్చ్‌ల పరిధిలోని భక్తులు భాగస్వామ్యులయ్యారు. వర్షాన్ని లెక్క చేయకుండా భక్తులు ఉత్సాహంగా భాగస్వామ్యులు కావడం ప్రత్యేకగా చెప్పవచ్చు. క్రైస్తవులు ఈ సందర్భంగా ప్రత్యేక విధానాలు, వ్రతాలు పాటిస్తారు.




పెద్దసంఖ్యలో చేరిన భక్తులు



గొడుగులతో భక్తులు ఇలా..



విశేషపూజల్లో ఆర్చ్‌బిషప్ తదితరులు



విద్యుద్దీపాలంకరణలో చర్చ్

మీకు మద్దతుగా సీబీఐ, ఐటీ, గవర్నర్... మాకు రాజ్యాంగం, చట్టం

»» బీజేపీపై మంత్రి ఖర్గే ఎద్దేవా

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మీకు మద్దతుగా సీబీఐ, ఐటీ, ఈడీ, గవర్నర్‌లు ఉండవచ్చు. అయితే రాజ్యాంగం, చట్టం ఉందని బీజేపీ నాయకులను ఉద్దేశించి మంత్రి ప్రియాంక ఖర్గే మండిపడ్డారు. సోషల్‌మీడియాలో రాజ్యసభ సభ్యుడు లెహర్‌సింగ్ ఆరోపణలను నిరాకరించారు. నిన్ను లేదా నీ రాజస్థానీ బ్యాక్‌గ్రౌండ్‌ను వ్యక్తిగతంగా ప్రస్తావించినట్టు చూపగలరా అంటూ ప్రశ్నించారు. మీ ఆరోపణలు అంగీకరించడం సాధ్యం కాదన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. నా వ్యాఖ్యలకు తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని మానుకోవాలన్నారు. మీరు ప్రతిభావంత రాజకీయనేత అని భావించానని అదితప్పు అని గుర్తించానన్నారు. మా నైతికత గురించి ప్రస్తావించారని, మీ నాయకుడు పోక్సో కేసుపై మీ అభిప్రాయం ఏమిటన్నారు. ఇందుకు లెహర్‌సింగ్ కూడా 'ఎక్స్' ద్వారా ఒక లేఖ పోస్ట్ చేశారు. 59 ఏళ్లుగా కర్ణాటకలో నివసిస్తున్నా అని, కన్నడ మాట్లాడడం, చదవడం, రాయడం వచ్చు అన్నారు. కర్ణాటక బీజేపీ కోశాధికారిగా పనిచేశానని, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించానన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల తరహాలో రాజకీయ వంశం నుంచి వచ్చినవాడిని కాదన్నారు. ఇతరుల ఇళ్లపై రాయి వేసేముందు అద్దాల మేడలో ఉన్నామనేది ప్రియాంక ఖర్గే గుర్తుంచుకోవాలన్నారు. అతడి తండ్రి మల్లికార్జున ఖర్గే కంటే ఆరేళ్లు చిన్నవాడినని, అతడికంటే ఎక్కువకాలం రాజకీయాల్లో ఉన్నారనేది, నా అనుభవం గురించి ప్రశ్నించాల్సిన అవసరం లేదన్నారు.

28 శాతం తినేందుకు యోగ్యం కాదు

»» కబాబ్‌పై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు వెల్లడి

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో తయారవుతున్న కబాబ్‌లో 28 శాతం తినేందుకు సరికాదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు వెల్లడించారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆహార భద్రత, నాణ్యతకు సంబంధించి జూలైలో నగర వ్యాప్తంగా పరిశీలనలు చేశామన్నారు. 275 కబాబ్ శ్యాంపిల్స్‌ను సేకరించగా 78 నమూనాల ప్రకారం 28శాతం తినేందుకు అర్హత కాదని తేలిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు జరిపిస్తున్నామని, పలు చోట్ల రంగులు పసుపు, టెట్రాజిన్ ఉప యోగిస్తున్నట్టు తేలిందన్నారు. 209 గోబి నమూనాలలో 31 లేదా 15శాతం కృత్రిమ రంగులు వాడినట్టు తేలిందన్నారు. కూరగాయలు, పండ్లను పరిశీలించామని, 266 నమూనాలు సేకరించామన్నారు. వీటిలో 10శాతం సురక్షితం కాదన్నారు. ఈ నమూనాలలో ఎక్కువ శాతం క్రిమి సంహారకమందులు వినియోగించినట్టు, బ్యాక్టీరియా ఉన్నట్టు తేలిందన్నారు. కోలారు నుంచి వచ్చే కూరయగాలను నాణ్యతను అంశాన్ని ప్రస్తావిస్తూ సంస్కరించబడిన నీటి విని యోగంపై అధ్యయనం చేస్తున్నామన్నారు. ఆగస్టులో పన్నీర్, కోవా, కేక్ నమూనాలను పరి శీలించామన్నారు. పీజీలలో ఇచ్చే ఆహారం, హాస్టళ్లలో ఆహారాన్ని పరిశీలిస్తామన్నారు. ప్రతి నెలా కొన్ని ఆహార పదార్థాలను సేకరించి పరిశీలనలు చేస్తున్నామన్నారు. జూలైలో 3467 ఆహార విక్రయాలపై పరిశీలనలో 132 మందిచే రూ.4.90 లక్షల జరిమానా వసూలు చేశామన్నారు.

సమస్యలను పరిష్కరించకపోతే టీచర్స్ డే బహిష్కరణ

»» వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం హెచ్చరిక

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే టీచర్స్ డేను బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం హెచ్చరించింది. ఫ్రీడం పార్కులో గురువారం రాష్ట్రవ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నిరసన చేపట్టింది. గౌరవాధ్యక్షుడు అరుణ్ శెహాపుర మాట్లాడుతూ 17ఏళ్లక్రితమే వ్యాయామ ఉపాధ్యాయులను స్కూల్ అసిస్టెంట్‌లుగా చేయాలనే ఆదేశాలు జారీ అయ్యా యన్నారు. కానీ అమలు జరగలేదన్నారు. వ్యాయామ ఉపా ధ్యాయుల పట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని ఆరోపించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చౌడప్ప మాట్లా డుతూ స్కూల్ అసిస్టెంట్‌లుగా పరిగణించకపోయినా ఇప్పటివరకు హెడ్‌మాస్టర్‌లుగా పదోన్నతి కల్పించ లేదన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు అమలు చేయ కపోతే ఎలాగన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి నేతృత్వంలో విన్నవించా మన్నారు. స్పీకర్ యూటీ ఖాదర్ సమస్యను పరిష్కరించా లని ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. గడువులోగా పరి ష్కరించకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. ఢిల్లీలో అధికార ప్రతినిధి, కాంగ్రెస్ నేత ప్రకాశ్ హుక్కేరి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి బాలరాజ్, కార్యాధ్యక్షుడు పిబి కాగోడు, ఉపాధ్యక్షులు అనిల్ యూఆర్, కేఎస్ శాస్త్రి, ఎం గోపాల్, ఎం సదానంద, రాజారాంశెట్టి, త్యాగం హరికేళితో పాటు నగీనాఖానం, విజయలక్ష్మిభట్, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనుంచి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలకార్మిక నియంత్రణపై జాగృతి

శిడ్లఘట్ట, ఆగస్టు 29: తాలూకాలో బాలకార్మిక పద్ధతిని సంపూర్ణంగా తొలగించి బాలల హక్కులను కాపాడడం తమ లక్ష్యమని ఇందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని జిల్లా కార్మిక అధికారి శోభన పిలుపునిచ్చారు. జిల్లా పాలకవర్గం, జిల్లా కార్మిక యోజనె సంఘం, జడ్పీ, జిల్లా న్యాయసేవల ప్రాధికార ఆధ్వర్యంలో 'బచపన్ బచావో...' అనే నినాదాలతో జాగృతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈనెల 31వరకు అభియాన ఉంటుందన్నారు. అందమైన బాల్యాన్ని కోల్పోరాదనే ఉద్దేశ్యంతోనే అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరిస్తూ వీటి నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంత ట్రస్టు నారాయణస్వామి, మక్కళ రక్షణ విభాగం విజయకుమార్, మక్కళ సహాయవాణి కేంద్రం రోజా, ప్రభుత్వ హైస్కూల్ హెడ్మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో జాగృతి



దొడ్డబనహళ్ళి గ్రామ సభలో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి తదితరులు

ప్రభుత్వ సౌలభ్యాలు సద్వినియోగం చేసుకోండి

మహదేవపుర, ఆగస్టు 29: వివిధ శాఖల ద్వారా సామాన్యులకు లభించే పథకాలు, వాటిని పొందే విధానం గురించి ఆయాశాఖల అధికారుల నుంచి పొందేందుకే గ్రామసభ ముఖ్య ఉద్దేశ్యమని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని దొడ్డబనహళ్ళి గ్రామపంచాయతీ 2024-25 వార్షిక తొలి గ్రామసభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రెవెన్యూ, సాంఘిక సంక్షేమశాఖ, ఉద్యానవనాలు, వ్యవసాయం, పట్టు, పౌర ఆహార సరఫరాలు, స్త్రీ శిశుసంక్షేమ, విద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయతీ ఈఓ వసంతకుమార్, అక్షత టి.వై. దొడ్డబనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు అనిల్ దొడ్డబనహళ్ళి, ఉపాధ్యక్షురాలు శశికళ మంజునాథ్, బెంగళూరు డెయిరీ ఉపాధ్యక్షుడు కేఎంఎం మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో అప్రెంటిస్‌షిప్‌కు అవకాశాలు

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ విద్యా ర్థులకు జర్మనీలో అప్రెంటిస్‌షిప్‌కు అవకాశాలు ఉన్నాయని కెరీర్ పరంగా సద్వినియోగం చేసుకోవాలని బెంగళూరులోని జర్మనీ డిప్యూటీ కాన్సులేట్ అన్నేట్ బేసలర్ అభిప్రాయపడ్డారు. నెట్టూరు టెక్నికల్ ఫౌం డేషన్ (ఎన్‌టిటిఎఫ్), మ్యాజిక్ బిలియన్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాన్సులేట్ మాట్లాడుతూ కేవలం అప్రెంటిస్‌షిప్ మాత్రమే కాకుండా అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేటివ్ మెకట్రానిక్స్ ప్లాంట్, మెకానిక్స్, ఎలక్ట్రానిక్స్, కార్ టెక్నాలజీ, కటింగ్ మిషన్ టెక్నాలజీ వంటి విభాగాలలో నైపుణ్యత సాధించవచ్చునన్నారు. ఎన్‌టిటిఎఫ్ ముఖ్యులు ఆర్ రాజగోపాలన్, బివి సుదర్శన్, మ్యాజిక్ బిలియన్ ఫౌండర్ బసావ్ బెనర్జీలు పాల్గొన్నారు. ఇప్పటికే వంద మంది విద్యార్థులతో షార్ట్‌లిస్ట్ సిద్ధం చేశామని, వారిలో 70మందికి జర్మన్ కంపెనీలనుంచి ఆఫర్ లెటర్‌లు వచ్చాయన్నారు. జర్మన్ భాషా సంస్కృతిలో నైపుణ్యాన్ని సాధించి వచ్చే ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు దాకా జర్మన్‌లో గడిపేందుకు వీరు వెళ్తారన్నారు. అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్ 3 నుంచి మూడున్నరేళ్ల వరకు లర్న్ అండ్ ఎర్న్ విధానంలో జర్మన్ డిప్లమో సర్టిఫికేషన్‌తో ముగుస్తుందన్నారు. ఎంపికైనవారికి 1500 యూరోలు (1.20 లక్షల రూపాయల దాకా) స్టైఫండ్ ఉంటుందని వివరించారు.

విలాసవంతమైన ప్రయాణానికి ఓల్వో బస్సులు



ఓల్వో ఈవీ విలాసవంతమైన బస్సు

బెంగళూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ప్రయాణానికి ఓల్వో ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెచ్చామని ఎండీ సీఈఓ వినోద్ అగర్వాల్ వెల్లడించారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఓల్వో ఎలక్ట్రికల్ కమర్షియల్ వెహికల్ లిమిటెడ్, ఓల్వో గ్రూప్, ఐషర్ మోటార్స్‌ల మధ్య 'ప్రవాస్ 4.0' నెక్స్‌జెనరేషన్‌కు ఉత్తమ ప్రయాణానికి అనుకూలం కానుందన్నారు. ఓల్వో 9600 విలాసవంతమైన కోచ్ బస్సులు రూపొందించామన్నారు. బస్సు పరిశ్రమలో ఆధునీకరణ తీసుకొచ్చేందుకు కట్టుబడ్డామన్నారు. ఈడీ సురేశ్ చిట్టియార్ మాట్లాడుతూ డ్రైవింగ్, రూపకల్పనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ప్రవాస్ 4.0 ప్రదర్శనలో ఓల్వో 9600 కోచ్, ఐచర్ స్కైలైన్ ప్రొ ఇ 13.5 మీటర్ల ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ కోచ్, ఐచర్ స్కైలైన్ ప్రొ 3010 బస్సులను ప్రదర్శించింది.

వ్యవసాయ విద్యార్థుల అధ్యయనం

శిడ్లఘట్ట, ఆగస్టు 29: తాలూకాలోని అబ్లూడు గ్రామపంచాయతీ పరిధిలోని శెట్టిహళ్ళిలో పట్టు వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు గ్రామస్థులతో చేరి అధ్యయన శిబిరంలో పాల్గొన్నారు. గ్రామంలో సంచారం, ఆలయాలు, జల వనరులు, పంటలు, ఇలా వేర్వేరుగా గుర్తించేలా ప్రత్యేక నమూనాను సిద్ధం చేశారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డుపై మట్టి, రాయి, పూలు, ఇతర రంగులతో గ్రామానికి సంబంధించిన బ్లూ ప్రింట్‌లాంటి నమూనాను రూపొందించారు. పంటలసాగు ప్రాధాన్యతను వివరించారు. జీవరసాయనశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ మంజునాథ్ గౌడ, డాక్టర్ పల్లవి, గ్రామపంచాయతీ సభ్యులు మూర్తి, రామచంద్ర, అంబరీశ్, చన్నకేశవ, భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద గ్రామ నమూనాతో విద్యార్థుల బృందం

చిన్నారులకు మెరుగైన చికిత్స



ఓవం ఆసుపత్రి ప్రారంభంలో ఎమ్మెల్యే బైరతి బసవరాజ్

మహదేవపుర, ఆగస్టు 29: తక్కువ బరువు, ఊపిరి సమస్యలతో కూడిన పిల్లల అనారోగ్యంతో బాధపడేవారికి తగిన చికిత్సలు సాధ్యమని ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ అభిప్రాయపడ్డారు. కేఆర్‌పుర నియోజకవర్గంలోని కొత్తనూరులో ఓవం ఆసుపత్రి ఆరోశాఖను ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక ఉపకరణాలతో ఇక్కడ మెరుగైన వైద్యసేవలు ఉన్నాయన్నారు. ప్రజలకు గుణాత్మకమైన చికిత్స అందించాలని సూచించారు. ఓవం ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఆదర్శ్‌కుమార్ మాట్లాడుతూ 2014లో ప్రారంభమైన ఓవం ఆసుపత్రి బెంగళూరులో ఉత్తమ చికిత్సలు అందిస్తున్నట్టు తెలిపారు. బాణసవాడిలో తొలిశాఖ ఏర్పాటు చేశామని కొవిడ్ అనంతరం శాఖలను క్రమేపీ విస్తరించినట్టు తెలిపారు. తల్లీబిడ్డల సురక్షతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చిదానంద్, డాక్టర్ జానస్ మాథ్యూ, డా మంజుళా ఎస్ పాటిల్, డాక్టర్ శ్వేత వెంజమూర్తి, వెంకట్ శివ రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

